ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

తక్కువ ధరకే బైక్‌లు అంటూ మోసం

- ఇతరుల ఆధార్‌కార్డు సేకరించి డౌన్ పేమెంట్‌తో కొనుగోలు
- మరికొందరికి రూ. 70 వేల చొప్పున విక్రయం
- ఈఎంఐలు కట్టకపోవడంతో వెలుగులోకి..
- వివరాలు వెల్లడించిన మట్టెవాడ సీఐ తుమ్మ గోపి

వరంగల్‌చౌరస్తా, జూన్ 13: తక్కువ ధరకే షోరూం ద్విచక్ర వాహనాలు అందజేస్తామని నమ్మబలికి మోసం చేసిన వ్యక్తిని మట్టెవాడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మట్టెవాడ సీఐ తుమ్మ గోపి వివరాలు వెల్లడించారు. వరంగల్ కొత్తవాడలో నివాసముంటున్న బిట్ల సందీప్(30) అడ్డదారుల్లో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో దళితబంధును పోలిన స్కీమ్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందని, తనకు కేవలం రూ. 70 వేలకే బైక్ ఇస్తున్నారని, సాక్షి సంతకం కోసం ఆధార్‌కార్డు, పాన్‌కార్డు ఇవ్వాలని పలువురిని కోరి వారి నుంచి జిరాక్స్‌లు సేకరించాడు. అనంతరం వారి పేరుతో ప్రైవేట్ బ్యాంకులు, సంస్థల నుంచి తక్కువ డౌన్ పేమెంట్‌లో ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేశాడు. తర్వాత ఇతరులకు ప్రభుత్వ స్కీమ్ గురించి చెప్పి వారిని నమ్మించి ఒక్కో బైక్ రూ. 70 వేల చొప్పున విక్రయించాడు. ఇతరుల పేరున తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేయించాడు. మూడు నెలల తర్వాత మీ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని వారిని నమ్మబలికాడు. మూడు నెలల తర్వాత లోన్ ఇచ్చిన సంస్థల ప్రతినిధులు బైక్ లోన్ ఈఎంఐలు చెల్లించాలని నిందితుడికి ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌లు ఇచ్చిన వారికి నోటీసులు జారీ చేయడంతో అసలు విషయం బయటపడింది. లబోదిబోమంటూ బాధితులు మట్టెవాడ పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా, తాను చేసిన మోసం ఒప్పుకున్నాడు. ఈ మేరకు 10 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. సందీప్‌ను అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన మట్టెవాడ పోలీసులను సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఉన్నతాధికారులు అభినందించారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTER OF CHITS / ARBITRATOR AT KARIMNAGAR
ARB. NO. 112/2023
Between:-
SOMASHEKARA CHIT FUNDS PRIVATE LIMITED., Represented by its Branch Foreman, Jammikunta Branch ...Disputant
AND
Kankanala Srinivas reddy and Others ...Opponents
Opp.No(02) Vontela Rahul Kumar, S/o. Komuraiah, Age: 52 Years, R/o. H.No. 2-6-9/1, Krupa Nilayam, Circuit House Road, nakkalagutta, District Hanamkonda, 506001
Opp.No(03) Jannu Sravan Kumar, S/o. Manikyam, Age: 46 Years, R/o. H.No. 1-2-302, Rehmath Nagar, Near St Johns High School, Kazipet District: Warangal Urban, 506003
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you. But you have failed to receive the same. The above dispute is posted on 30-06-2025 for your appearance. On that day you have to appear in person at 11:00 a.m. before the deputy registrar referred above. other-wise case will be decided ex-parte.
Sd/- CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS KARIMNAGAR.

పరామర్శిస్తున్న ధర్మారెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటా

గీసుగొండ, జూన్ 13: కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పసుల పరశురాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. శుక్రవారం అతడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. చల్లా వెంట బీఆర్ఎస్ మండల కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు జైపాల్‌రెడ్డి, ప్రకాశ్, నాయకులు రాజేందర్, ప్రమోద్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

మంగళ, శుక్రవారం డ్రైడేగా పాటించేలా చూడాలి

60 ఏళ్లు దాటిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

సమీక్షలో కలెక్టర్ సత్యశారద

సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్షిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్, జూన్ 13: వర్షాకాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల నివారణ చర్యలపై కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. జిల్లావ్యాప్తంగా గ్రామం, వార్డుల్లో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, మ్యాపింగ్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడేగా పాటించేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. వాటర్ లాగిన్ పాయింట్స్, ఆయిల్‌బాల్స్, గంబూషియా చేపలు వేయాలన్నారు. లోతుట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికంగా నీరు నిల్వకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పరిశుభ్రత, దోమల నివారణపై ఆరోగ్య సిబ్బంది గ్రామసభల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 60 ఏళ్లకు పైబడిన వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా శిథిల భవనాలు, ఇళ్లను గుర్తించి తొలగించాలని ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సాంబశివరావు, డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, మలేరియా అధికారి రజిని, డీబీసీడీఏ పుష్పలత, మున్సిపాలిటీల కమిషనర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

గిరిజనులకు సౌకర్యాలు కల్పించాలి

జిల్లాలో గిరిజనులకు ప్రభుత్వం ద్వారా సౌకర్యాలు కల్పించాలని, జూన్ 15 నుంచి 30 వరకు ప్రతి గిరిజన గ్రామంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) నిర్వహణపై సమీక్షించారు. గిరిజనులకు సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో కేంద్రం పీఎం జన్‌మాన్, దరతి అభా జనజాతి గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జిల్లాలో 15 గ్రామాల్లో గిరిజనులు అధికంగా ఉన్నారన్నారు. నల్లబెల్లి మండలంలోని కన్నారావుపేట, గోవిందరావుపేట, రాయపర్తి మండలంలోని పోతిరెడ్డిపల్లి, జగన్నాథపల్లి, గీసుగొండ మండలంలోని నందనాయక్‌తండా, నర్సంపేట మండలంలోని రాజుపేట, ఖానాపురం మండలంలోని డబీర్‌పేట, మంగళవారిపేట, చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్, ఎల్లారిగూడెం, నెక్కొండ మండలంలోని పత్తిపాక, గొట్లకొండ, బొల్లికొండ, పర్వతగిరి మండలంలోని నారాయణపూర్, రావూరును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని ప్రజలందరికీ ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆయూష్మాన్ కార్డు, రేషన్‌కార్డు, కిసాన్‌కార్డు ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లలో సిబ్బంది ఉన్నారా లేదా పరిశీలించాలని, అవసరమైతే వెంటనే సిబ్బందిని నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆర్రేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందుతుందా లేదా పరిశీలించాలని, 102 వాహన వినియోగం, వందశాతం టీకాలు వేశారా లేదా అని పరిశీలించాలన్నారు. ప్రతి ఒక్కరికి జన్‌ధన్ బ్యాంకు ఖాతా తెరవాలన్నారు. ముద్ర రుణాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

కాశీబుగ్గ: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా వేర్‌హౌస్ గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ సత్యశారద అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి వివిధ రాజకీయ పార్టీల నేతల సమక్షంలో తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడు నెలలకోసారి నిర్వహించే సాధారణ తనిఖీలో భాగంగా స్ట్రాంగ్‌రూమ్‌లో రికార్డులు, భద్రత చర్యలు, సీసీ కెమెరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఎన్నికల నయాబ్ తహసీల్దార్ రంజిత్, నాయకులు బాకం హరిశంకర్, చింతం రాజు, దాసరి రాజేశ్, శ్యామ్‌సుందర్, ఫైజోద్దీన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సంపేట, జూన్ 13: నర్సంపేట పట్టణంతోపాటు మండలవ్యాప్తంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు నర్సంపేట టౌన్, రూరల్ విద్యుత్ శాఖ ఏఈలు ఎన్.విజయభాస్కర్ రావు, ఎం.ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని వల్లభ్‌నగర్, మండలంలోని మహేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

వరంగల్ నగరంలో..

హనుమకొండ: వరంగల్‌టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వరంగల్ టౌన్ ఆపరేషన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు దేశాయిపేట, ఆరెపల్లి, ఏజే మిల్, స్టేషన్‌రోడ్డు, ఫోర్టు వరంగల్, ఉర్సు సబ్‌స్టేషన్ ఏరియాల్లో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

పర్వతగిరి, జూన్ 13: లారీ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని రావూరులో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మోత్యాతండాకు చెందిన బదావత్ రాములు(50) కల్లెడ వైపు నుంచి మోత్యాతండాకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

పర్వతగిరి, జూన్ 13: మండలంలోని అనంతారం, గోపనపల్లి, కొంకపాక, సోమారం, మాల్యాతండా, బూరుగుమళ్ల, కల్లెడ, రోళ్లకల్, నారాయణపురం, వడ్లకొండలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శుక్రవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 2.20 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, కార్యదర్శులు, నాయకులు అనిల్‌రావు, శ్రీనివాస్‌నాయక్, మధుసూదన్‌రావు, అంజన్‌రావు పాల్గొన్నారు. కాగా, మండలంలోని అనంతారం శివారులో రోడ్డు ప్రమాదంలో అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రుడిని చూసిన ఎమ్మెల్యే నాగరాజు వెంటనే అంబులెన్స్‌ను రప్పించి దవాఖానకు తరలించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులు

రాయపర్తి, జూన్ 13: వేసవి సెలవులు ముగిసిన నేపథ్యంలో పాఠశాలలు పునఃప్రారంభయ్యాయి. ఈ మేరకు సర్కారు బడుల్లో పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు. మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్, ప్రాథమిక పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో కార్యదర్శి వల్లె వినోద్‌కుమార్ సారథ్యంలో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

ఖానాపురం, జూన్ 13: మండలకేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 50 శాతం రాయితీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో బోగ శ్రీనివాస్ తెలిపారు. జీలుగ విత్తనాలు 30 కిలోల బస్తాకు పూర్తి ధర రూ. 4275 కాగా, 50 శాతం రాయితీతో రూ. 2137 అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదారు పుస్తకం జిరాక్స్‌తో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంకట్రామ్(ఫైల్)

సంగెం, జూన్ 13: మండలంలోని వీఆర్ఎన్ తండాకు చెందిన గుగులోత్ వెంకట్రామ్‌నాయక్(37) వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎల్.నరేశ్‌నాయక్ తెలిపారు. గత నెల 29న వెంకట్రామ్ నాయక్ ఇంట్లో పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని ఎంజీఎం దవాఖానలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డబ్బు కోసమే మేనత్త హత్య

- రూ.18 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
- ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

నిందితుడి అరెస్ట్ చూపిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

సుబేదారి, జూన్ 13: మద్యానికి అలవాటుపడి డబ్బు కోసం మేనత్తను దారుణంగా హత్య చేసిన నిందితుడిని గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఇటీవల గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్తంభంపల్లికి చెందిన వృద్ధురాలు కోచన స్వరూప(70) హత్యకు గురైంది. వరంగల్ మట్టెవాడ రాజీవ్ కాలనీకి చెందిన రేకులపల్లి ప్రణయ్ బైక్ కొనుగోలు కోసం అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో ప్రణయ్ గీసుగొండ, మట్టెవాడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డాడు. స్తంభంపల్లిలో ఒంటరిగా ఉంటున్న మేనత్త మెడలో ఉన్న బంగారు ఆభరణాలు, డబ్బుపై అతడి కన్నుపడింది. ఈ నెల 7న రెండు బీర్లు కొనుగోలు చేసి మేనత్త స్వరూప ఇంటికి వెళ్లాడు. అక్కడ మద్యం తాగాడు. అదే రోజు స్వరూప నిద్రలో ఉండగా వ్యాయామం చేసే డంబెల్‌తో తలపై కొట్టి చనిపోయిన తర్వాత ఆమె మెడలో ఉన్న బంగారు, వెండి నగలు, ఇంట్లో ఉన్న డబ్బు దోచుకెళ్లాడు. మేనత్తను హత్య చేసిన సమయంలో నిందితుడు ప్రణయ్ చేతికి గాయం కాగా, మట్టెవాడలోని తన ఇంటికి వెళ్లి రక్తం మరకలు ఉన్న దుస్తులు విప్పి, ఎంజీఎం దవాఖానకు వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన పోలీసులు కేసును ఛేదించారు. నిందితుడి నుంచి రూ. 18 లక్షల విలువైన 170 గ్రాముల బంగారు ఆభరణాలు, 34 గ్రాముల వెండి, రూ. 10 వేల నగదు, బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసిన గీసుగొండ పోలీసులు, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని డీసీపీ అభినందించారు.

పార్కులో టౌన్‌షిప్ పనులు ప్రారంభించాలి

- ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్
- మెగా టెక్స్‌టైల్ పార్కు సందర్శన

ప్లాస్టిక్ బాటిల్‌తో దారం తీసే విధానాన్ని సంజయ్‌కుమార్‌కు వివరిస్తున్న గణేశా కంపెనీ మేనేజర్

గీసుగొండ, జూన్ 13: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ప్రభుత్వం రాజీవ్ మెగా లేవుట్ టౌన్‌షిప్ పనులతోపాటు మౌలిక వసతుల కల్పనకు శంకుస్థాపన చేసిందని, ఆ పనులను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన రాష్ట్ర పరిశ్రమల కార్పొరేషన్ శాఖ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారదతో కలిసి పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా గణేశా, కిటెక్స్, యంగ్‌వన్ కంపెనీల్లో చేపట్టిన ఉత్పత్తులను పరిశీలించారు. కిటెక్స్ కంపెనీలో నిర్వహిస్తున్న ట్రయల్ రన్‌ను పరిశీలించారు. అనంతరం పార్కులో వరద ముంపు నివారణకు నిర్మిస్తున్న నదీనాల ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వంద మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న రిటైనింగ్ వాల్ పనులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. పార్కు కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ఇండ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయాలని కుడా అధికారులను ఆదేశించారు. మెగా టౌన్‌షిప్ పనులను ప్రారంభించాలన్నారు. పార్కులో జరుగుతున్న పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చీఫ్ ఇంజినీర్ రవి, జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ రియాజుద్దీన్, సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మైనర్లను అబ్జర్వేషన్ హోమ్‌కు తరలింపు

వరంగల్ చౌరస్తా, జూన్ 13: నగరంలో శుక్రవారం ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడిన తొమ్మిది మంది బాలురకు జువైనల్ మెజిస్ట్రేట్ ఒకరోజు అబ్జర్వేషన్ హోమ్‌లో గడపాలని శిక్ష విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించామని, మరోమారు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడిన అబ్బోజు వెంకటేశం, మరో తొమ్మిది మందికి రూ. 3,900, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మరో 28 మందికి రూ. 37,700 జరిమానా విధించినట్లు తెలిపారు. పిల్లలకు బైక్‌లు ఇవ్వొద్దని సూచించారు.

సర్కారు బడుల్లో సామూహిక అక్షరాభ్యాసం

పర్వతగిరి: అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

కరీమాబాద్/నర్సంపేట/పోచమ్మమైదాన్/వరంగల్ చౌరస్తా/కాశీబుగ్గ/పర్వతగిరి, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరంగల్ 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ ఎస్ఆర్ఆర్‌తోటలోని ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీపూజతోపాటు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. నర్సంపేట మండలంలోని ముగ్దుంపురంలో హెచ్ఎం కొమ్మయ్య ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం చేశారు. ఎంతావో కొర్ర సారయ్య పాఠశాలలను పరిశీలించారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌళి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎండీ రఫీ పిల్లలకు పలకలు, బలపాలు అందజేసి అక్షరాలు దిద్దించారు. కొత్తవాడలోని గిర్మాజీపేట ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని విశ్రాంత హెచ్ఎం ఎం.సుజాత, హెచ్ఎం శ్యామల్‌రావు ప్రారంభించారు. ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ మౌలాలీ పాఠశాల, దేశాయిపేటలోని ప్రభుత్వ పాఠశాల, నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో అక్షరాభ్యాసం చేశారు. వరంగల్ 36వ డివిజన్ చింతల్ ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్ అందజేశారు. వరంగల్‌లోని 3వ డివిజన్ పైడిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను హెచ్ఎం బదావత్ దస్రూ ఆధ్వర్యంలో కొబ్బరి మట్టలు, మామిడి తోరణాలతోపాటు రంగు కాగితాలు, బంతిపూలతో అలకరించారు. అందమైన రంగల్లిలతో బాలబాలికలకు స్వాగతం పలికారు. అనంతరం కార్పొరేటర్ జన్ను షీభారాణి అనిల్ పిల్లలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించారు. అలాగే, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పర్వతగిరి మండలంలోని కొంకపాక ప్రభుత్వ పాఠశాలలోని అంగన్‌వాడీ సెంటర్‌లో చేనిన విద్యార్థులతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాల చేశారు.

కాశీబుగ్గ: సామూహిక అక్షరభ్యాసంలో పాల్గొన్న కార్పొరేటర్ జన్ను షీభారాణి అనిల్

'రైతుల సమస్యలు పరిష్కారం కావాలి'

గీసుగొండ, జూన్ 13: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతుల భూ సమస్యలు పరిష్కారం కావాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. గీసుగొండ మండలంలోని ఎలుకుర్తిలో నిర్వహించిన సదస్సును శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగొద్దని, అధికారులు మీ వద్దకే వచ్చి విచారించి పట్టాలు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఆర్ఐలు సాంబయ్య, శ్రీధర్, సర్వేయర్ భాస్కర్ పాల్గొన్నారు. అలాగే, నల్లబెల్లి మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు ముగిశాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ ముప్పు కృష్ణ మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 2702 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 1226 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అందుబాటులో లేని వారు ఈ నెల 20లోగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కుమారస్వామి

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

పోచమ్మమైదాన్/చెన్నారావుపేట, జూన్ 13: పోచమ్మమైదాన్‌లో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి పాల్గొని మాట్లాడుతూ మూడేళ్లలో పిల్లలను ఇంటి వద్ద ఖాళీగా ఉంచకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. చెన్నారావుపేట మండలంలోని తిమ్మరాయిన్‌పహాడ్ సెక్టార్‌లోని లింగగిరి అంగన్‌వాడీ సెంటర్‌లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

కొబ్బరిచెట్టుపై పడిన పిడుగు

కాలిపోతున్న కొబ్బరి చెట్టు

కరీమాబాద్, జూన్ 13: ఉర్సు బొడ్రాయి వద్ద ఉన్న శివాంజనేయస్వామి ఆలయం సమీప కాలనీలోని కొబ్బరి చెట్టుపై శుక్రవారం సాయంత్రం పిడుగు పడింది. దీంతో ఒక్కసారిగా చెట్టుపై మంటలు చెలరేగాయి. మంటలను గుర్తించిన స్థానికులు ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కన్నారావుపేటలో రోడ్డుపై మొరం పోయిస్తున్న రైతులు

రోడ్డు బాగు చేసుకున్న రైతులు

నల్లబెల్లి, జూన్ 13: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా పట్టించుకోకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో రైతులు తమ సొంత ఖర్చులతో రోడ్డును పునరుద్ధరించుకున్న ఘటన మండలంలో వెలుగుచూసింది. కన్నారావుపేట రైతులు ఈదులకుంట మీదుగా పంట పొలాలకు వెళ్లాలంటే వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రూ. 12 లక్షలతో మెటల్‌రోడ్డు మంజూరు చేయించారు. ఈ క్రమంలో ఎన్నికలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ ఈ నిధులను రద్దు చేసింది. ఏడాదిన్నర కాలంగా కాంగ్రెస్ సర్కారు రోడ్డును పునరుద్ధరిస్తుందని రైతులు ఎదురు చూశారు. కానీ, ఏ ఒక్కరూ తట్టెడు మట్టి పోయలేదు. వర్షాకాలం ప్రారంభం కావడంతో విధిలేక కొందరు రైతులు విరాళాలు సేకరించి తాత్కాలికంగా రోడ్డును పునరుద్ధరించుకున్నట్లు రైతులు పులిగుజ్జల రాజమల్లు, కాసర్ల రవీందర్‌రెడ్డితోపాటు పలువురు రైతులు తెలిపారు. కలెక్టర్ స్పందించి ఈదులకుంట చెరువు మీదుగా బుచ్చిరెడ్డిపల్లి వైపు వెళ్లే రోడ్డును బాగు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

రైతులు రసీదులను భద్రపర్చుకోవాలి

సంగెం, జూన్ 13: విత్తనాలు, ఎరువులు, రసాయనిక, పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో ఫర్టిలైజర్ వ్యాపారుల నుంచి తీసుకున్న రసీదులను పంటకాలం పూర్తయ్యే వరకూ భద్రపర్చుకోవాలని వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రావుల ఉమారెడ్డి